# నిద్ర

కళ్ళు మూసుకుని పక్కమీద అటు పొర్లి యిటు పొర్లి విసుగుపుట్టింది. కళ్ళు తెరిచాను.

నల్లటి చీకట్లో, మిణుగురు పురుగుల్లా, గోడమీద లేత నీలం రంగులో రెండు గీతలు మెరుస్తున్నాయి.

ఒకటీ నలభై నిముషాలు!

చేతికందిన వస్తువును తీసుకొని ఎలక్ట్రానిక్ గోడ గడియారాన్ని పగలగొట్టాలనిపించింది. దాని రేడియం ముళ్ళను విరగ్గొట్టి ముక్కలు చేయాలనిపించింది.

అన్ని వందలు పోసి కొన్న గడియారం - అంత మెల్లగా తిరుగుతుందేం? తన మనసెరిగి పరుగెత్తదేం? రాత్రిని గిరగిర తిప్పేయదేం?

నాకు పిచ్చెక్కినట్లుంది.

ఇంతా చేస్తే నేను పక్కనెక్కి గంటేనా అయింది? నాకేమో కొన్ని యుగాలు గడిచినట్టు అన్పిస్తున్నదేం?

లైట్ తీసేస్తే నిద్ర పడ్తుందన్న ఆశపోయింది గదా? లేచి ఒక స్విచ్ నొక్కాను.

సీలింగ్‌లో ఏర్పాటు చేసిన వో లైట్ వెలిగింది. బెడ్ మినహా మిగతా గదినంతా పాల నురుగు లాంటి తెల్లటి కాంతి పరుచుకుంది.

పందిరిమంచం - ఫోమ్‌బెడ్ - ఎయిర్ కండిషన్ రూమ్ - గదంతా సుగంధ పరిమళం - టేబిల్ మీద పాలు - పళ్ళు - తినుబండారాలు.

మరో స్విచ్ నొక్కాను. సన్నగా వాద్య సంగీతం.

పక్కన అందమైన భార్య. భార్య మెడలో నగలు.

ఇన్ని ఉన్నా నాకు నిద్ర పట్టదేం? ఇదేం ఖర్మ?

మరో స్విచ్ నొక్కాను. బెడ్ మీదికి కాంతి ప్రసరించింది.

సుభద్ర నగలు తళుక్కుమన్నాయి. ఆమె అందం మెరిసింది.

గాఢనిద్రలో వున్న సుభద్ర మొహం అత్యంత ప్రశాంతంగా, ప్రసన్నంగా వుంది. ఆమె సన్నటి గురక - బిస్మిల్లాఖాన్ షెహనాయ్ వాద్యంలా శ్రావ్యంగా వుంది. అలా వున్న సుభద్రను చూస్తుంటే నాకు ముద్దొస్తుంది. వంగి ఆమె బుగ్గలమీద సున్నితంగా చుంబించాను.

నా చర్యలేవీ సుభద్ర నిద్రను భగ్నం చేయలేవు. చేయవు. ఆ విషయం నాకు రూఢీగా తెల్సు.

కానీ నా నిద్ర. నాకు లోకం మీద కోపం వచ్చింది.

గ్రహాంతర యానాలు, గుండె మార్పిడులు చేసే సైంటిస్టులు నిద్ర పోయేదానికి

ఆపరేషన్లు కనిపెట్టరేం? బట్ట తలకు ఇంజక్షన్లు కనుక్కోలేరేం? మా డాక్టరు గుర్తుకొచ్చాడు.

నా దగ్గర డబ్బు గుంజుతూ నన్నే ప్రశ్నలడుగుతాడు.

"నిద్ర పట్టని జబ్బు మీకు చిన్నతనం నుంచే వుందా?" పిచ్చి ప్రశ్న! సమాధానం చెప్తే కథ అవుతుంది. సుభద్ర ఒకప్పుడు నిద్ర పట్టని మనిషి. "రేపును తల్చుకొంటుంటే భయమండీ, నిద్రెలా పడ్తుంది?" అనేది అప్పుడు. ఇప్పుడో? సుభద్ర నిద్రపోతోంది హాయిగా.

కానీ తను?

✡ ✡ ✡

"దరిద్రానికి నిద్ర అన్నారు. ఊరు పొద్దుగూకక ముందే నిద్రా దేవత నీ నెత్తికెక్కి కూర్చుంటుందేంరా? ఇట్లాగయితే పరీక్షలేం పాసవుతావ్? ఉద్యోగాలేం వెలగబెడ్తావ్? మహా మహా క్లాసుల్లో పాసయిన వారికే పారగతుల్లేవ్. ఈ నిద్రాదేవతను వదిలించుకోకపోతే నువ్వు ఎర్రని ఏగానికి ఫనికి రావ్. లే, లే. చన్నీళ్ళతో మొహం కడుక్కొని చదువుకో."

చిన్నప్పుడు నా నిద్రను చూచి అమ్మ అలా విసుక్కొనేది.

అదేంటో కాని నాకు నిద్ర పిలవందే పలికేది. హాయిగా కౌగిలించుకొనేది. నిద్రా సౌఖ్యం ముందు అన్ని సుఖాలు బలాదూరే అనిపించేది నాకు.

నాన్నకు నే నంటే ప్రేమ ఎక్కువ. పక్కన పడుకోబెట్టుకుని కథలు చెప్పేవాడు. అమరకోశం, శబ్దమంజరి వల్లె చెప్పేవాడు.

కథలు ఏం వినేవాడినో ఏమో? శబ్దమంజరి, అమరకోశం ఆయన ఆరంభించగానే నా రెప్పల మీద మెత్తటి కొండలు నిలబడినట్లయ్యేది. మైకం కమ్మేది. పలుకుతున్నట్లే పలుకుతూ నిద్రపోయేవాడిని.

నేను అన్నం తినకుండా పడుకొంటే నాన్న ప్రాణం గిలగిలలాడి పోయేది. నన్ను లేపి అన్నం కలిపి స్వయంగా తినిపించబోయేవాడు.

"వాడికి మీ అన్నం ఎందుకండీ? నిద్ర పెద్దమ్మ వుంటే చాలు."

అమ్మ మాటలు నాకప్పుడు నిజం అనిపించేవి. నిద్రలేపి అన్నంతినమని సతాయించే నాన్నంటే చిరాకు వేసేది. ఏడ్చి మారాం చేసే వాడిని.

"మా నాన్నవికదూ! నెయ్యి ఎక్కువ వేసి కలిపిన ముద్ద. యీ ఒక్క ముద్ద తిని పడుకో. మజ్జిగ అన్నం గుజ్జుగా కలిపేను. అన్న రసం ఇది. తాగెయ్యాలి. నా తండ్రి బుద్ధిమంతుడు - బంగారుకొండ."

నాన్న బతిమలాడి తినిపించి కానీ పడుకోనిచ్చేవాడు కాడు. నాన్న అన్ని చెప్తున్నా నాకు అన్నం రుచించేది కాదు. కమ్మటి నిద్రను చెడగొట్టి ఈ అన్నం పెట్టకపోతేనేం? అన్నం కన్నా నిద్ర రుచిగా వుంటుందని నాన్నకు తెలియదా? నాన్న మీద కోపం వచ్చేది.

"స్కూలు ఫస్టు రావల్సినంత తెలివిగలవాడు నీ పుత్రుడు. కానీ ఏం లాభం? క్లాసులో మాస్టర్లు పాఠాలు చెప్తుంటే సన్నగా కునుకి పాట్లు పడ్తుంటాడాయె! పుస్తకం తెరిస్తే

నిద్రముంచుకొస్తుందాయె! ఇంకేం ఫస్ట్‌వస్తాడు? అయినా వీడి తెలివి కూల? థర్డ్ వచ్చాడు.'

"ఏదో చిన్నపిల్లవాడు. తెలివితేటలు వున్న వాడేకదా! ముందు ముందు అన్నీ అవే సర్దుకొంటాయి లెండి. నిద్రపోయే వాడిని లేపి చదివిస్తే మటుకు నెత్తికెక్కుతుందా ఆ చదువు?"

నాన్న స్కూల్లో టీచర్లతోనే కాదు, అమ్మ దగ్గరా ఇదే అనేవాడు.

"ఆ ఆ...ఈ జ్ఞానం, నిద్రలేపి అన్నం తినిపించేటప్పుడు ఎక్కడికి పోతుందో?" నాన్నను పొడిచేది అమ్మ.

"చదివితే తల కెక్కదు. అన్నం మాత్రం పొట్టలోకి దిగుతుంది. అంతేనా?"

"అంతేనే, సరిగ్గా అంతే. అన్నం తినటం, శరీర ధర్మం. చదువుకోటం బుద్ధిధర్మం. అందుకే అది దిగుతుంది. ఇది పైకి ఎక్కదు. నీకా సూక్ష్మాలు తెలియవులే."

కొంచెం పెద్దయ్యాక నాన్న మాటల్లో సత్యం నాకు తెల్సి వచ్చింది.

సుషుప్తావస్థలో వున్నా అన్నం కడుపులోకి దిగితే, దాని పని అది చేసుకుపోతుంది, శరీరం... కానీ ఆ స్థితిలో బుద్ధి పని చెయ్యదు. జ్ఞానాన్ని రిసీవ్ చేసుకోదు.

నిద్రనునిగ్రహించుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని నేను ఎంతో ప్రయత్నించాను. పరీక్షలలో ఫస్టు మార్కులు సంపాదించాలని ప్రయత్నించాను. కానీ నిద్రా దేవత నన్ను వదల్లేదు. నేను అలా చదువులో ఎంతో నష్టపోయాను.

అయినా నేను వస్తుతః తెలివితేటలు కలవాడిని కావటం చేత ఏ క్లాసు ఫెయిల్ కాలేదు. ఒక్కసారి విన్నా, చదివినా బుర్రకు దాన్నలా అతికించుకొనే శక్తి వుండటం వల్ల ఫస్టులో కాకపోయినా సెకెండ్ థర్డులలో ఎప్పుడూ వుండేవాడిని.

మా నాన్న ఎంతటి సహృదయుడో అంతటి బీదవాడు. అయినా కష్టపడి చిరునవ్వుతో సంసారాన్ని ఈదుకొచ్చాడు. ఆరోగ్యం చెడకపోతే ఆఖరిశ్వాస వదిలేదాకా లాక్కొచ్చేవాడు. కానీ భగవంతుడు ఆయన్ని సరిగా చూడలేదు.

ఆయన మూలన పడడంతో నేను చదువు మానేసి, సంసార బరువును నెత్తినేసుకోక తప్పలేదు.

కానీ నేనెత్తుకొందామనుకోగానే సరిపోయిందా? ఉద్యోగం యిచ్చేవారు వుండొద్దూ?

"నీ మొహాని కెవరు ఉద్యోగం యిస్తార్రా? ఆ యోగ్యతే వుంటే ఫస్టు క్లాసే రాక పోయిందా? నా మొహాన వంటలక్క గీత రాసి పెట్టి వుందిలే"

అమ్మ వంటలు చేయటమా? నో, వీల్లేదు, అమ్మ మాట చదువు విషయంలో నిజమయింది. ఉద్యోగం విషయంలోనైనా అబద్ధం చేయాలి.

పట్టుదలగా ప్రయత్నాలు చేసేను.

ఆ రోజు ఇంటర్వ్యూకి వెళ్ళాలి. వేయబోయే ప్రశ్నల్ని వూహించి సమాధానాలు బాగా ప్రిపేర్ అయ్యాను. భోజనం చేసి గంట ముందుగా ఇంటర్వ్యూకి బయలుదేరాను. అలస్యమవుతే బస్సులు దొరకటం కష్టంకదా?

బస్సు చిక్కింది. బస్సులో సీటు కూడా చిక్కింది. విండో సీట్.

టికెట్ కొని ఇంటర్వ్యూని గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను.

"మిస్టర్! బస్ ఇక పోదు. డిపోకి వెళుతుంది. దిగు, దిగు."

నేను ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూచాను. నేను ఎక్కిన చోటే బస్ వుంది. అదే స్టార్టింగ్ పాయింట్, మరి...

చేతి గడియారం చూచుకొన్నాను. గుండె పగిలినట్లయింది.

"బస్సు నువ్వు ఎక్కేక ఇప్పటికి అటూ ఇటూ నాలుగు ట్రిప్పులు తిరిగింది. యిది బస్సనుకున్నావా? బెడ్‌రూమ్ అనుకున్నావా? నాలుగు ట్రిప్స్‌కు టు అండ్ ఫ్రో టికెట్ ఫేర్ చెల్లించి బస్సు దిగు. లేకపోతే ఆ రిస్ట్‌వాచ్ అక్కడ పెట్టు, నేను డబ్బు చెల్లిస్తాను. యివిగో నేను నీ కోసం కోసిన టిక్కెట్లు."

"కానీ నా ఇంటర్వ్యూ..."

"అంటే- ఉద్యోగానికి ఇంటర్వ్యూకని బయలుదేరి బస్సులో బజ్జున్నావా నా తండ్రీ? నీకు ఉద్యోగం ఎవడైనా యిస్తే వాడో పెద్ద చవట, నిన్ను మించిన నిద్రమత్తుగాడన్నమాట! అయినా నువ్వేం ఉద్యోగం చేస్తావులే కాని నిద్రపో."

ఇంటర్వ్యూ ఛాన్సు పోయిందన్న బాధకన్నా కండక్టర్ వాయింపు బాధ నాకు భరించరాని దయింది. డబ్బు చెల్లించి వాడి బారి నుంచి బయటపడ్డాను.

కానీ ఇంటికెళ్ళి ఏం చెప్పటం?

"ఏరా? హాయిగా నిద్రపోయినట్లు వుంది గాని, నీ మొహం ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చినట్లుందా? కొంపతీసి ఏ బస్సులోనో, ఆఫీసు బల్లమీదనో నిద్రపోయి లేచిరావటం లేదు కదా?"

ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే అమ్మ! అబద్ధాలు చెప్పి లాభం లేదు. నిజం చెప్పేసేను.

ఇంటిల్లి పాది వొకటే నవ్వటం.

"నిద్ర ఆరోగ్యమైనదే నాన్నా. కానీ వాళ్ళు తెలియని నిద్ర, వేళా పాళా, సమయం సందర్భం లేని నిద్ర, యిలాంటి వుపద్రవాలను తెచ్చి పెడ్తుంది. పెద్దవాడివయ్యావు. నిద్రను నిగ్రహించుకొనే ప్రయత్నం చెయ్యి!" ఎన్నడూ లేనిది నాన్న నాకా సలహా యిచ్చాడు.

మొత్తం మీద నా అదృష్టం బాగుంది. గుమాస్తా పరీక్ష అప్పుడెప్పుడో రాసేను. అది పాసయ్యాను. ఇంటర్వ్యూ లేదు. కనుక ఆర్డర్ రాగానే వెళ్ళి చేరిపోయాను.

రెండో రోజు తొమ్మిదిన్నరకు భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళబోతుంటే అమ్మ చెప్పింది.

"అన్నం తిని బస్సెక్కితే నిద్రపోతావురా. యీ వుద్యోగం వూడితే మనం అడుక్కు తినాల్సిందే. మీ నాన్న సైకిలుందిగా. దాని మీద వెళ్ళు, అన్నం అరిగినట్లుంటుంది. నిద్రా దూరమవుతుంది."

నాన్న డొక్కు సైకిలు దులిపి బయలుదేరాను.

ఇంటి నుంచి ఆఫీసుకు రెండు మైళ్ళ దూరం. ట్రాఫిక్‌వల్ల అలా అనిపించదు. కొంత దూరం అప్, మరి కొంత దూరం డౌన్.

కష్టపడి తొక్కి సైకిల్‌ను అప్ ఎక్కించాను. ఆ తర్వాత డౌన్. తొక్కాల్సిన పని లేదు. చల్లటి గాలి. రయ్‌మని పోతోంది సైకిలు.

ఎప్పుడు రెప్పలు వాలాయో ఏమో?

కళ్ళు తెర్చేసరికి ఎక్కడ ట్రాఫిక్ అక్కడ ఆగి వుంది. నాకు నాలుగు వైపులా వాహనాలు. రోడ్ల కూడలిలో గొడుగు క్రింద ఉండే పోలీసు నా వద్దకు రావటం కన్పించింది.

క్షణంలో జరిగిందేమిటో నాకు అర్థమయింది. నేను కునుకు తీసి ట్రాఫిక్ సిగ్నల్ చూచుకోలేదు. కారు క్రింద పడబోయాను. కారు ఆగింది. దాంతో నాలుగు వైపుల ట్రాఫిక్ ఆగిపోయింది.

పోలీసు వాడు పట్టుకుంటే వాడు మళ్ళీ వాయిస్తాడు. నలుగురిలో నగుబాట్లు. పైగా ఆఫీసు... అమ్మో...

నాకు ఆ క్షణంలో ఎప్పుడూ లేని తెగువ సాహసం వచ్చాయి.సైకిలెక్కి వెనక్కి తిరిగి చూడకుండా తొక్కసాగాను... అసలే డౌను. దానికి తోడు బలంగా తొక్కటం.

ఆఫీసులో కుర్చీ, బల్ల, చూడగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

"అయిదయింది నాయనా, మేము రిటయిరవ బోయేముందు చేస్తున్న పనిని నువ్వు వుద్యోగంలో చేరీ చేరగానే ఆరంభించావే? సంతోషం. ఎంతైనా ప్రభుత్వ వుద్యోగం. కనుక భద్రత వుందనుకో. అయినా దేశం - యువతరం - సాధిస్తున్న ప్రగతికి నువ్వు వో గొప్ప నిదర్శనంలా నాకు కనిపిస్తున్నావోయ్? లే లే ... మళ్ళీ పొద్దు గూకుతుంది..."

సూపరింటెండెంట్ వ్యంగ్యం బల్లెంకన్నా వాడిగా గుండెల్లో గుచ్చుకుంది. నిద్రను నిగ్రహించుకోవాలన్న పట్టుదల పెరిగింది.

ఫలితంగా కన్ను మూయలేదు.

కానీ ఎంత కష్టపడ్డాను? ఎంత ఇబ్బంది పడ్డాను?

నిద్రనంటే ఆపుకొన్నాను కానీ, ఆ మత్తును అరికట్టటం ఎలా? నిద్రమత్తుతో బుద్ధి శరీరం వుంటే యింకేం పని చేయగలను?

అయినా నెలాఖరుకు, నేను చేసిన పనితో ప్రమేయం లేకుండా ముద్దల ముడుపుగా నా జీతాన్ని నాకు చెల్లించారు.

"ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మనం చేసిన పనికి జీతం యివ్వరు నాయనా. వేళకొచ్చి కుర్చీలో కూర్చున్నందుకు యిస్తాయి. నిద్రపోకుండా కూర్చున్నందుకు నీకు బోనస్ కూడా యివ్వాలి" సూపరిండెంట్ మళ్ళీ పొడిచాడు.

బయటకొచ్చి బస్సెక్కాను. బస్ రద్దీగా వుంది. నిలబడ్డాను.

అడుగడుగునా బ్రేకులు పడి ఆగుతూ, కదుల్తూ బస్సు వెళ్తోంది. ఎడం చేత్తో హాంగింగ్ రాడ్ పట్టుకున్నాను. కుడిచేతితో మొదటి జీతం డబ్బులున్న జేబును అదిమి పట్టుకున్నాను.

కాస్సేపటికి బస్సు ఉయ్యాలగా మారింది. నిద్ర వచ్చేసింది. ఎంత? క్షణం! చాలా చిన్న కునుకు. అంత మాత్రానికే జేబు మీద నున్న చెయ్యి జారిపోయింది. జేబులో డబ్బు మాయమయింది.

"పెళ్ళాం వస్తేనన్నా నీ నిద్ర తగ్గుతుందేమో! నీ నిద్రకు ఆ మహాతల్లి విరుగుడు మందు కనిపెట్టాల్సిందే!" అమ్మ అంది. అని వూరుకోలేదు. పెళ్ళిచేసేసింది నాకు.

సుభద్ర నాకు బాగా నచ్చింది. ఆమెతో మొదటి రాత్రి కోసం వువ్విళ్ళూరేను.

ఆ రాత్రి రానేవచ్చింది. నాకు చాలా సర్దాగా వుంది. మనసు ఆనందపు మత్తులో వుంది. మొదటి రాత్రి తీపిని గురించి విన్నాను. నాకా తీపి లభించబోతున్నది.

శోభనం గదిలో పరుపు మీద పడుకొని తీపి ఆలోచనలో వుండగా -

ఎప్పుడు తెల్లవారిందోతెల్లవారింది.

సుభద్ర అప్పడే అలంకరింపబడ్డ బొమ్మలా అల్లంత దూరంలో కూర్చుని వుంది.

"సారీ సుభద్రా, నిద్ర పట్టేసింది. లేపకపొయ్యావా?"

సుభద్ర మెల్లగా నవ్వింది.

"అత్తయ్యగారు భయపడ్తూనే వున్నారు పాపం! అదే జరిగింది. తప్పు మీది కాదు. మీరు నిద్రపోయేలోగా ముందు రాలేకపోయిన నాదే" అంటూ లేచి పారిపోయింది.

ఆ తర్వాత నా కన్నా ముందుగానే పడక మంచం ఎక్కటం నేర్చుకొంది.

పడక - తాంబూలం, అన్నీ సిద్ధం చేసుకొని కాని నాకు భోజనం పెట్టేది కాదు. అవసరమైతే నాకన్నా ముందుగానే భోజనం ముగించుకుని తాంబూలం పట్టుకొని నేను మంచం వద్ద కెళ్ళేసరికి రెడీగా వుండటం నేర్చుకొంది.

కొంతకాలం ఇద్దరం కల్సి కంటారా నిద్రపోయాం.

యిద్దరు పిల్లలు పుట్టేక సుభద్రకీ నిద్రపట్టటం మానేసింది.

✡ ✡ ✡

టేప్ ఆగిపోయిందో ఏమో లౌడ్ స్పీకర్ 'గుర్ గుర్' మంది.

నా ఆలోచనలకు భంగం కలిగి గుర్రుగా దాని వైపు చూచాను.

సంగీతం విన్పిస్తూనే వుంది. టేప్ ఆగలేదు. లౌడ్ స్పీకర్ ఫాల్టు లేదు. ఆ 'గుర్రు' సుభద్రది.

సుభద్ర గురకకు పరిణామతత్వం వుంది. గతి తార్కిక భౌతిక వాదానికి కూడా నిలబడ్తుందేమో నాకు తెలీదు కానీ పరిశోధనాంశమే.

ఆ రోజు నా నిద్రను జయించటానికి అనుసరించిన విధానం యిప్పు ఆమెకు అలవాటుగా మారిపోయింది. ఆఖరి మెతుకు గొంతు దిగకముందే చెయ్యి కడిగేసుకుని మంచం ఎక్కుతుంది. ఆ పందిరి మంచం ఆమె సంపాదించిందే. అది మా ఇంటికి వచ్చిన దగ్గరి నుంచే తనకు నిద్ర పట్టటం ఆరంభమైందని ఆమెకు సెంటిమెంట్ వుంది.

మృదంగపు లయలను కూడా నేను ఆస్వాదించగలను. కానీ అన్ని చర్మ వాయిద్యాలు, లోహ వాయిద్యాలు కల్సి చేసే శివ తాండవ శబ్దాలను ఆస్వాదించే సహృదయం నాకు లేదు. ఆ శబ్దాలు వింటే నాకు పిచ్చెక్కుతుంది. ఆ స్థాయికి సుభద్ర గురక ఏ క్షణంలోనైనా చేరవచ్చు.

అసలే నిద్రలేక పిచ్చెక్కుతున్నది. దానికి తోడు యిదికూడానా?

కానీ ఏం చేయటం?

నిద్రపోవటానికి అనేక సాధనాలున్నాయిని నాకు తెలుసు.

బ్రాందీ, పెథిడిన్, హిరాయిన్.......... సవాలక్ష-

కానీ వాటి జోలికి పోతే నేను చాలా తొందరలో చస్తానని డాక్టర్ భయపెట్టేడు. అసలే నాకు ధనంలో పాటు, ధనవంతులకు వచ్చే అనేక జబ్బులు వచ్చాయి. మరి డాక్టర్ అజ్ఞ పాటించక తప్పదు. నిద్ర కోసం చేతులారా ప్రాణాన్ని ఎలా తీసుకోను?

"అసలు యీ రోగానికి మూల కారణం ఏమిటి డాక్టర్?"

నాకు వున్న యితర రోగాలకు నిద్రపట్టక పోవటానికి సంబంధం లేదు. అవి డాక్టర్ కంట్రోల్‌లోనే వున్నాయి. శారీరకంగా నిద్రపట్టకపోవటానికి ఏ కారణమూ కనబడదు. మానసికమే అయివుండాలి. అని యింత చెప్పి ఆఖరికి డాక్టర్ నా ప్రశ్నను ప్రశ్నతోనే సమాధానం యిస్తారు.

"మీకు చిన్నతనం నుంచి నిద్రపట్టని రోగం వుందా? లేకపోతే ఎప్పటినుంచి వచ్చింది?"

ఆ తర్వాత మళ్ళీ కథ మామూలే!

✡ ✡ ✡

నిద్ర పట్టటం మానేసేక సుభద్ర నేను పక్కనెక్కేదానికి ముందే తను పడకవద్ద సిద్దంగా వుండే పద్ధతిని ఆపుచేసింది.

కొద్ది రోజులు నేను ఆ మార్పును పట్టించుకోలేదు. పక్కెక్కి గుర్రు కొట్టి నిద్రపోయేవాడిని.

కానీ కొన్నాళ్ళకు పడుకోగానే నిద్రపట్టడం మానేసింది నాకు. ఆశ్చర్యమేసింది. నిద్రపట్టకపోవటానికి గల కారణాలను గురించి ఆలోచిస్తూ, సుభద్ర వచ్చిందాకా పక్క మీద దొర్లేవాడిని.

జామపండునో, బెల్లం ముక్కనో చూచి పసిపిల్లవాడు ఆత్రంగా ఎగబడ్డట్లు సుభద్ర రాగానే ఆత్రంగా అమెను దగ్గరికి లాక్కొనే వాడిని. ఆమెలో ఐక్యం చెంది ఆ మరుక్షణం నిద్రపోయేవాడిని.

మరి కొన్నాళ్ళకు లాక్కోగానే దగ్గరికి వచ్చే విధానానికి మంగళం పాడింది సుభద్ర. నాకు కోపం వచ్చేది. మూతి బిగించుకుని పక్కకు తిరిగి పడుకుని నిద్రపోయే ప్రయత్నం చేసేవాడిని, కాని నిద్ర పట్టందే?

'మీకు నిద్ర పట్టదండీ, అలిగితే నష్టపోయేది మీరే. రేపెలా గడుస్తుందా అన్న చింతతో

నేను నిద్రపట్టక చస్తుంటే మీకెలా ఇన్నాళ్ళు నిద్ర పట్టిందండీ? మగవారు, యిల్లు కుటుంబం పట్టించుకోకుండా ఎన్నాళ్ళు యిలా బాధ్యతారహితంగా నిద్రపోదామనుకొన్నారు? ఎల్లకాలం మీ ముష్టి జీతంతో మన బ్రతుకులు వెళ్ళిపోతాయనుకున్నారా? పిల్ల పెళ్లికి ఎదుగుతుంది. రేపు పిల్లవాడు చదువులకు ఎక్కివస్తాడు. దప్పికయినప్పుడు బావి తవ్వుకొంటారా ఎవరైనా! ఇప్పటి నుంచి ఆలోచించి తగు ఏర్పాట్లు చేసుకోకపోతే ఎలా ?"

అప్పడాల పిండిని పిసికినట్లు, పీటకేసి కొట్టినట్లు...

సాగదీసి సాగదీసి కొట్టికొట్టి తనకి నిద్ర వచ్చినప్పుడు నన్ను లాలించి దగ్గరికి తీసుకుని నిద్రబుచ్చేది.

నేను నిద్రపోవడానికి అవసరమైన 'మందు' ఆమె వద్ద వుంది.

అందుకే ఆమెకు ఆ ధీమా. నన్ను ఆడిస్తోంది.

'నిద్ర పోవడానికి ముందు ముందు బోలెడంతకాలం ఉందండీ. మీరు తెలివిగలవారు. తల్చుకొంటే ఏదైనా చేయగలశక్తి గలవారు. మీ నిద్ర మిమ్మల్ని చెడగొట్తోంది. ఇలాగైతే తర్వాత చాలా బాధపడ్తారు. అప్పుడు నాకేకాదు. మీకూ నిద్ర పట్టదు. కనుక యిప్పుడే మేల్కొనండి, ఈ గుమాస్తా బతుకు ఎన్నాళ్ళు? నాలుగురాళ్ళు ఆర్జించే మార్గం చూడండి'

అలా పిసగ్గా పిసగ్గా కొట్టగా కొట్టగా అప్పడాల పిండి పక్వానికి వచ్చినట్లు నాలో ఆలోచనలు మేలుకొన్నాయి. నిద్ర వదిలి పోయింది. జడత్వం పోయింది. డబ్బు సంపాదించే ప్రణాళికలు వేయసాగేను. తక్కువ కాలంలో ఎక్కువ ధనం సంపాదించాలి. నిద్రను బలవంతంగా కట్టేసి ఆలోచించాను.

రూపాయికి స్టీలుగిన్నె, రెండు రూపాయలకి డిష్, అయిదు రూపాయలకి స్టీలుబిందె లేక టిఫిన్ కేరియర్ యిచ్చే పథకాన్ని ప్రవేశపెట్టేను. ఆ వ్యాపారం కాస్త పుంజుకోగానే వంద రూపాయలకు స్టీల్ బీరువా పథకాన్ని ప్రవేశపెట్టేను. రకరకాల టెక్నిక్కులని ఉపయోగించి సభ్యులను స్కీముల్లో చేర్చేను. ఒకరికి ఒక్క స్టీలుగిన్నె యిస్తే, వంద స్టీలు గిన్నెలకు సరిపడా సభ్యత్వం రుసుం వచ్చిపడింది. కొంతమందికి వస్తువులిచ్చాను. సమయం చూసి బోర్డు తిప్పేసేను.

డబ్బు ఆర్జించాలంటే తిట్లు శాపనార్థాలు భరించక తప్పదు కదా?

ఇంతలో నా అదృష్టం బాగుండి అప్పుడే ఆరంభించిన ఒక మెడికల్ కంపెనీ ఏజన్సీ వచ్చింది. ఆ కంపెనీ అనుకోనంత త్వరగా పెరిగింది. కంపెనీతోపాటు నేనూ పెరిగేను. షేర్లు, స్టాక్ మార్కెట్లు, అమ్మకాలు కొనుగోళ్ళు, అందులోనూ కల్సివచ్చింది.

అయినా నేను గుమస్తా వుద్యోగాన్ని వదల్లేదు. నన్ను వాళ్లు వుద్యోగంలో నుంచి తీసెయ్యలేదు. ఛార్జి షీట్లు యివ్వలేదు.

ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఔదార్యాన్ని భరించలేక నేనే ఆ మధ్య ఏదో రూలు వస్తే ఆ రూలు క్రింద వాలంటరరీగా రిటైరయ్యాను.

రూపాయికి స్టీటుగిన్నె పథకంలో నేను నిద్రను మర్చిపోవడం ఆరంభించాను. మందుల కంపెనీ ఏజన్సీ... స్టాక్ మార్కెట్లో లావాదేవీలలో లాభాలు రావటం ఆరంభమయ్యాక నన్ను నిద్ర మర్చిపోయింది.

నా కొకటి, మా ఆవిడ కొకటి యిళ్ళు కట్టించాను. యింకెన్నెన్నో చేయించాను.

మా ఆవిడ పూర్వం లాగా నా భోజనం అయ్యేసరికి తాంబూలంతో మంచం దగ్గర గా వుండే ఆచారాన్ని పునరుద్ధరించింది.

అయినా నాకు నిద్ర వస్తేనా? ఆమెకు నిద్ర ఆగితేనా?

గడియారం మూడు గంటలు కొట్టింది.

సుభద్ర గురక కూడా ఆగింది. యిక ఆమె లేస్తుంది. అప్పడాల పిండిని పిసికినట్లు, పీటకేసి కొట్టినట్లు ఆమెతో మరో గంట మాట్లాడితే తెల్లవారిపోతుంది. అమ్మయ్యా!

✡ ✡ ✡

"ఏమండీ, మీ కివాళ నిద్రపట్టలేదూ! అయ్యో! అలా కూర్చున్నారేమిటి?"

"నీ పాటకచేరి వింటూ........." నవ్వుతూనే అన్నాను

"నిద్రపోవటం ఎంత సహజమో నిద్రపోయే మనిషి గుర్రు కొట్టడం అంత సహజం. మీరు నిద్రపోయే రోజుల్లో నేనెన్ని పాటకచ్చేరీలు వినేదాన్నో మీకేం తెల్సు?"

"నా, ఆ, అదృష్టాన్ని చేతులారా నాశనం చేసిందాకా నువ్వు నిద్రపోలేదుగా?"

"పాపం వస్తుందండీ. నన్నెందుకు ఆడిపోసుకొంటారు? కుటుంబం పట్ల బాధ్యత కలిగి వుండమన్నాను. భవిష్యత్తును ఆలోచించి జాగ్రత్త పడమన్నాను. వృద్ధాప్యంలో బాధ్యతలు తీర్చుకుని బ్రతకడానికి సంపాదించమన్నాను. కానీ మిమ్మల్ని నిద్రపోవద్దన్నానా? అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయటంలో లోటేమైనా చేసేనా?"

"నాకు నిద్ర కావాలి. అందుకు నేను ఎంత డబ్బు ఖర్చుపెట్టడానికైనా సిద్ధమే. నన్ను పూర్వంలా నిద్రపుచ్చే బాధ్యత నువ్వు తీసుకోరాదూ?"

"నా దగ్గర వున్న మందు మీకు పనిచెయ్యడం మానేసి చాలా రోజులయిందండీ. నిద్ర, భగవంతుడు ఇచ్చిన వరం. ఆ వరాన్ని అతిగా వుపయోగించుకొంటే జీవితం నాశనమవుతుంది. బలవంతంగా ఆ నిద్రను అసహజ మార్గాలలో బంధించిపెట్టి దూరం చేసుకొన్నా సర్వనాశనం తప్పదు. అన్నిటికీ పరిమితులంటాయండీ. అది ప్రకృతి నిబంధన. దాన్ని వుల్లంఘిస్తే యిలాగే అవుతుంది. నిద్రకు పరిమితి వుంది. ఆలోచనకు పరిమితి వుంది. ఆశకు కూడా పరిమితికి వుంది.మీరానాడు పరిమితి మించి నిద్రపోయారు. పరిమితికి మించి ప్రణాళికల నాలోచిస్తూ ఆ నిద్రను దూరం చేసుకొన్నారు. ఆ నిద్రను మీరు కావాలనుకొంటున్నా పరిమితికి మించిన ఆశ దాన్ని దరిచేరనివ్వటం లేదు. అందుకే మీ కథ అసహజత్వపు సంపుటి అయింది..."

"అలాగే అనిపిస్తోంది నా క్కూడా. లేకపోతే ధనం లేనపుడు హాయిగా ఏమీ పట్టకుండా నిద్రపోవటమేమిటి? ధనాన్ని ఆర్జించాక నిద్రకు దూరం కావటమేమిటి? నువ్వు ఆ

రోజుల్లో నిద్రపోక యీ వేళ హాయిగా నిద్రించడమేమిటి? యిది నాకు అర్థంకాని పజిల్. నేనేం చేయాలో చెప్పు నువ్వే."

"ధనంతో అన్నిటినీ పొందవచ్చునన్న భ్రమ మీకు నిద్రను దూరం చేసిన దయ్యం. యింకా సంపాదించాలన్న ఆశ, ఆరాటం, సంపాదించింది ఎక్కడ పోతోందో నన్న భయాందోళనలు నిద్రను వోడించగల దుష్టశక్తులు. ఆ దయ్యాన్ని, దుష్టశక్తుల్ని అదుపులో వుంచుకోగలిగిన మనిషికి వద్దన్నా నిద్ర వస్తుంది. మీరు వాటిని జయించండి."

"చాలా గొప్ప సలహా, ఏదో సామెత చెప్పినట్లు - అయనే వుంటే మంగలివాడితో అవసరం ఏమిటి అన్నదిట వెనుక వొకావిడ. అది చాతనవుతే యీ గోలంతా ఎందుకు? ఆస్తిని ఐశ్వర్యాన్ని ఆర్జనను నేను వదులుకొందామనుకొన్నా అవి నన్ను వదలందే?"

"అలా అన్నారు, బాగుంది. యిక ఎన్నాళ్ళుగానో చెప్పకుండా ఆపుచేసిన మందును చెప్తాను వినండి.

"మందా? నిద్రకు నువ్వు మరో కొత్తమందును కూడా కనుక్కొన్నావా ఏమిటి?'

"ఊ. కానీ ఆస్తిని ఐశ్వర్యాన్ని ఆర్జనను వదులుకొనటానికి సిద్ధపడ్డానని మీరు అన్నారు కదూ? అలాంటి వారికే యీ మందు పని చేస్తుంది."

"యింతకీ మందేమిటో చెప్పు."

"పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. మన బాధ్యతలు తీరిపోయాయి. మనకూ వృద్ధాప్యం దగ్గర పడ్తున్నది. మనకిప్పుడు హాయిగా నిద్రపట్టాలంటే మనసుకు ప్రశాంతత కావాలి. యీ భవబంధాలకు దూరంగా వెళ్ళి వానప్రస్తాశ్రమ జీవితం గడపటమే దానికి సరి అయిన మందు."

"అంటే సన్యాసిని కమ్మంటావా?"

"ఆ శక్తి మీ కెక్కడిదిలెండి? ఇద్దరం కల్సి తీర్థయాత్రలకు పోదాం -"

"పిల్లలు పుట్టటానికి, పుణ్యం కోసం, తీర్థయాత్రలు చేస్తారని విన్నాను కాని...."

"మీకు ఆ రెండూ అక్కర్లేదు కదా? అంచేత పెళ్ళాంతో కల్సి తీర్థయాత్రలు నిద్రకోసం చేయండి. దీన్ని నిద్రయాత్ర అందాం!"

"యీ మందుకు నిద్ర పడ్తుందనే హామీ ఏమిటి?"

"మంచి ప్రశ్న. ఎలాగైనా బిజినెస్ మేన్ కదా? తీర్థయాత్రలను, నిద్రాదేవిని తల్చుకొంటూ కళ్ళు మూసుకొని "రామ రామ" అని అనుకొంటూ పడుకోండి. నిద్ర పట్టి నమ్మకం కుదిరితేనే వెళ్దాం."

కోళ్ళు బయట ఎక్కడన్నా కూస్తున్నాయేమో నాకు విన్పించే అవకాశం లేదు. సుభద్ర చెప్పినట్లు చేసేను.

పదిహేను నిముషాల తర్వాత నిద్ర పట్టేసింది!

విజయ, మార్చి, 1985